దళితుల భూమిని కాపాడాలని తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నెక్నాంపూర్ దళితులు

మణికొండ: అనాదిగా దళితులు సాగుచేసుకుని వారి ఆధీనంలో ఉన్న భూమిలో పక్క లే అవుట్‌లో లేని బై నెంబర్లతో ప్లాటుగా చూపి కబ్జాకు ప్రయతిన్నస్తున్నారని నెక్నాంపూర్ గ్రామానికి చెందిన దళితులు గండిపేట తహసీల్దార్‌కు పిర్యాదు చేశారు. కబ్జాకు పాల్పడుతున్న వారిపై చట్టరీత్యా తగు చర్య తీసుకుని సదరు భూమిని కాపాడాలని తహసీల్దార్‌ను కోరారు. వివరాలివీ... మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 20లో ప్రభుత్వ భూమి ఉంది. దాన్ని తాతల కాలం నుంచి దళితులు సాగుచేసుకుంటున్నారు. దానిపై తమకు హక్కులు కల్పించాలని హైకోర్టును ఆశ్రయించటంతో వారికి అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చింది. దాని పక్కనే సర్వే నెంబర్ 31లో 59 ఎకరాల భూమిలో సెక్రటేరియట్ ఉద్యోగులకు ఇంటి స్థలాలను ఇచ్చారు. వారి హద్దులు దాటి చనిపోయిన కొందరు సభ్యుల పేర్లతో సర్వే నెంబర్ 20లోకి జరిగి బై నెంబర్‌లు వేసి అమ్మకాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వారి ఆడగాలను అరికట్టాల్సిన స్థానిక కౌన్సిలర్ వారి నుంచి కొంత స్థలాన్ని తీసుకుని అందులో మున్సిపాలిటీ నుంచి అనుమతులు తీసుకుని నిర్మాణం చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఫిర్యాదు చేస్తే నిర్మాణాన్ని ఆపి ఇపుడు తిరిగి కొనసాగిస్తున్నాడని, అతనిపై చర్యలతో పాటు మున్సిపల్ ఇచ్చిన అనుమతులను రద్దు చేసి దళితుల భూమిని కాపాడాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎ.మల్లేష్, పి. కృష్ణ, యాదయ్య, గోపాల్, శంకర్ పాల్గొన్నారు.

వేడుకగా అయ్యప్ప స్వామి పడిపూజలు

మారుమోగిన అయ్యప్ప నామ స్మరణలు ● హాజరైన ప్రముఖులు



పుప్పాలగూడలో అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి



నార్సింగిలో మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్

మణికొండ: అయ్యప్ప నామస్మరణతో పుప్పాలగూడ లాలమ్మ గార్డెన్, నార్సింగి మున్సిపాలిటీ కేంద్రాలు మారుమోగాయి. పుప్పాలగూడలో గురుస్వామి బి.శ్రీ రాములు, నార్సింగిలో గురుస్వామి యాదిలాల్‌లు అయ్యప్ప స్వామి మహా పడిపూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడల రమేష్ బృందం పాడిన భక్తి పాటలు అందరినీ అలరించాయి. అనంతరం గురుస్వాములు 18 మెట్ల మహాపడిని కాల్చారు. పుప్పాలగూడలో కౌన్సిలర్ బి.మీన ముత్యాలు ఏర్పాటు చేసిన అన్నదానం (భిక్ష)లో అయ్యప్ప మాలాధారులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పడిపూజలో ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కౌన్సిలర్‌లు, నార్సింగిలో మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో పరిపూర్ణ ఆరోగ్యం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం హిమాయత్‌సాగర్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 22 డివిజన్‌లలో ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్, ఆస్పత్రుల పరిసరాల్లో పరిశుభ్రత, నిల్వ ఉన్న స్టాగ్నెట్ వాటర్ తొలగించడం, లీకేజీల నివారణ, గ్రాస్ కట్టింగ్ పరిసరాల పరిశుభ్రతకై చెత్త కుప్పల, మట్టి దిబ్బల తొలగించే అంశాలపై చర్చించారు. వివిధ విభాగాల అధికారులు, సూపర్‌వైజర్ అధికారులు, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, రిసోర్స్ పర్సన్‌లు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కళాశాలల క్రీడా పోటీలు



వాలీబాల్ ఆడుతున్న బాలికలు



వాలీబాల్ ఆడుతున్న బాలురు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాల క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. అందులోభాగంగా రెండవ రోజు బుధవారం వివిధ పోటీల్లో క్రీడాకారులు తలపడ్డారు. ఫుట్‌బాల్, వాలీబాల్‌ల క్రీడల అశ్వరావుపేట, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు తలపడుతుండగా, బాల్ బ్యాడ్మింటన్‌ల సంగారెడ్డి అగ్రికల్చర్ ఇంజినీరింగ్ కళాశాల, అశ్వరావుపేట్ విద్యార్థులు తలపడుతున్నారు. బాలికలు వాలీబాల్, టెబుల్ టెన్నిస్‌లో తలపడుతున్నారు.

రహదారి విస్తరణకు లైన్‌క్లియర్!

- బస్టాండ్ నుంచి నర్కూడ శివారు వరకు విస్తరణ
- వాహనదారులకు తీరనున్న కష్టాలు

మరింత దూరం విస్తరించేందుకు చర్యలు



ఒయాసిస్ స్కూల్ సమీపంలో విస్తరణ పనుల కోసం షాబాద్ రహదారిని చదును చేసిన దృశ్యం

శంషాబాద్ రూరల్: శంషాబాద్–షాబాద్ రహదారి విస్తరణకు ముందడుగు పడింది. మూడు కిలో మీటర్ల దూరం వరకు విస్తరణకు రెండు శాఖల నుంచి నివేదిలకు పంపగా.. అక్కడి నుంచి నిధులు మంజూరు అయ్యాయి. దీంతో పనులు ఏ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాలనే మీమాంసలో అధికారులు ఉండిపోయారు. అయితే మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలనే తలంపుతో విస్తరణ దూరాన్ని పెంచి పనులు జరిగేలా చర్యలు చేపడుతున్నారు.

అసలేం జరిగిందంటే..

రోడ్లు భవనాల శాఖ పరిధిలో ఉన్న షాబాద్ రహదారిని కొంత దూరం విస్తరించేందుకు గతంలో నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించారు. ఇదే సమయంలో శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చేంత దూరం వరకు విస్తరణ కోసం హెచ్‌ఆర్‌డీసీఎల్ నుంచి నివేదిక వెళ్లింది.

- శంషాబాద్ బస్టాండ్ నుంచి ఒయాసిస్ స్కూలు వరకు మూడు కిలో మీటర్ల దూరం విస్తరణకు రెండు శాఖలకు రూ. 18 కోట్ల చొప్పున నిధులు మంజూరు అయ్యాయి. దీంతో ఒకే పనికి రెండు శాఖలకు నిధులు రావడం.. ఈ పనులు ఎవరు చేపట్టాలనే ప్రశ్న ఉత్పన్నమైంది.
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ రెండు శాఖల అధికారులతో చర్చించి.. నిధులను ఎలాగైన సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందుకు తగిన ప్రణాళికతో ముందుకు సాగాలని కూడా ఆయన స్పష్టం చేశారు.

వాహనదారులకు ఊరట..

రోడ్డు విస్తరణకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. శంషాబాద్ బస్టాండ్ నుంచి నర్కూడ శివారు వరకు ఐదు కిలో మీటర్ల దూరం విస్తరణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ రహదారిపై రద్దీ కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విస్తరణ పనులు పూర్తి చేస్తే ఊరట కల్గుతుంది. దీంతో పాటు కవేలిగూడ చౌరస్తాలో మూల మలుపు వద్ద భారీ గుంతల సమస్యకు పరిష్కారం దొరికితే మరింత సౌకర్యంగా మారుతుంది.



కవేలిగూడ చౌరస్తాలో రోడ్డు దుస్థితి

మరింత దూరం విస్తరణకు..

మంజూరైన నిధులతో రోడ్డును మరింత దూరం విస్తరించేందుకు ఆర్అండ్‌బీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

- బస్టాండ్ నుంచి ఒయాసిస్ దూరం వరకు రూ. 18 కోట్లతో హెచ్‌ఆర్‌డీసీఎల్ విభాగం పనులు చేయాలని నిర్ణయించారు. ఒయాసిస్ నుంచి నర్కూడ శివారు వరకు ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టనున్నారు. సుమారు రెండు కిలో మీటర్ల దూరం వరకు రోడ్డు విస్తరణతో పాటు కవేలిగూడ చౌరస్తాలో అర కిలో మీటరు దూరం వరకు సీసీ రోడ్డు వేయాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం.
- ఇలా రూ. 18 కోట్లను రోడ్డు విస్తరణ కోసం వినియోగించుకోవాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం ఒయాసిస్ స్కూలు వద్ద రెండు శాఖల ఆధ్వర్యంలో పనులు మొదలు పెట్టారు.

వారసత్వ కట్టడాలపై విద్యార్థులకు తెలియజేయాలి

గోల్కొండ: విద్యార్థులకు మన దేశ వారసత్వ కట్టడాల గురించి తెలియజేయాలని గోల్కొండ కోట సీనియర్ పరిరక్షణ అధికారి ఎం.నవీన్‌కుమార్ అన్నారు. వరల్డ్ హెరిటేజ్ వీక్ సందర్భంగా గోల్కొండ కోటలో ఏర్పాటు చేసిన వారసత్వ కట్టడాల ఛాయాచిత్రాల ప్రదర్శనలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దేశంలోని చారిత్రక కట్టడాల పరిరక్షణలో కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ ఎంతో కృషి చేస్తుందన్నారు. గోల్కొండ కోట సుమారు 500 ఏళ్ల క్రితం కట్టబడిందని అయితే దీని పరిరక్షణ కోసం సాంకేతిక సిబ్బందితో పాటు పరిరక్షణ సిబ్బంది సైతం ప్రతి నిత్యం కృషి చేస్తుందన్నారు. ఛాయాచిత్ర ప్రదర్శనను వివిధ పాఠశాలల విద్యార్థులతో పాటు గోల్కొండ ఉర్దూ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు తిలకించారు.

మహిళలతోనే 'ఇందిరా క్యాంటీన్ల' నిర్వహణ

సెర్ఫ్ డైరెక్టర్ డబ్ల్యూ జాన్సన్

రాయదుర్గం: ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్లను మహిళలే నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (ఎస్ఈఆర్‌పి) డైరెక్టర్ డబ్ల్యూ జాన్సన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని 'నిథమ్' పర్యవేక్షణలో సెర్ఫ్ ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణకు ఎంపికైన మహిళలకు వంటకాల తయారీ, కాంటీన్ల నిర్వహణ పది రోజుల శిక్షణా ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందించారు.అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం నిథమ్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎంకె గణేష్, చెఫ్‌లు తుల్జారామ్, మహేష్ మాట్లాడుతూ మహిళలు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. కృత్రిమ ఫుడ్‌కలర్ ఉపయోగించరాదని, సహజరంగులు మాత్రమే వాడాలని కోరారు. కార్యక్రమంలో సెర్ఫ్ సీఈఓ డి.దివ్య ,పర్యాటకశాఖ, నిథమ్ డైరెక్టర్ హన్మంతు , అధికారి శ్రావణ్‌కుమార్, కోఆర్డినేటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మిషెల్లి జే ఫ్రాన్సిస్, నిథమ్ అధికారులు పాల్గొన్నారు.

సర్వే సజావుగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న బండ్లగూడ కమిషనర్ శరత్‌చంద్ర



మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీ రవికుమార్

బండ్లగూడ: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో ప్రక్రియను సజావుగా నిర్వహించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. బుధవారం హిమాయత్ సాగర్‌లోని కార్యాలయంలో సూపర్‌వైజర్ ఆఫీసర్స్‌తో ఆయన సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... సూపర్‌వైజర్ ఆఫీసర్స్, ఎన్యూమరేటర్లతో పాటు ఫీల్డ్‌లో ఉండి రోజు ప్రతి ఎన్యూమరేటర్ 15 ఫారం ప్రభుత్వ నియమాల ప్రకారం వెరిఫై చేసి ఎలాంటి తప్పులు లేకుండా సరి చేసి ప్రతి ఫారంపై సంతకం చేసి కార్యాలయంలో అందించాలని సూచించారు.

పూర్తిస్థాయిలో నిర్వహించాలి...

అత్తాపూర్: సమగ్ర కుటుంబ సర్వేను పూర్తి స్థాయిలో నిర్వహించాలని జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ సూచించారు. బుధవారం అత్తాపూర్ వార్డు కార్యాలయంలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేగవంతంగా సర్వే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

పశు రక్తమార్పిడి ల్యాబ్ ఏర్పాటు



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న వీసీ

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలోని క్లినికల్ కాంప్లెక్స్‌లో పశువుల రక్త మార్పిడి ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ల్యాబ్‌ను బుధవారం పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ సబ్యాసాచి ఘోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పశు వైద్య కళాశాలలో ఆక్సిస్ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వివిధ రోగాలతో బాధ పడుతున్న పశువులకు రక్త మార్పిడి ద్వారా చికిత్స చేస్తారన్నారు. ఈ సదుపాయాన్ని రైతులు, పశు పెంకందారులు, పెంపుడు కుక్కలు, పిల్లుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ శరత్‌చంద్ర, డీన్ డాక్టర్ రఘునందన్, చిన్న పీత్రం, డాక్టర్ మహేందర్, గోపాల్‌రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో నేత్రాలు పదిలం



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: స్వీయ జాగ్రత్తలతో కంటి సమస్యలు రాకుండా చూసుకోవచ్చని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ పేర్కొన్నారు. హోలీ క్రాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మ్యాక్సీ విజన్ ఐ హాస్పిటల్ సహకారంతో రాజేంద్రనగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 300 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో సెల్‌ఫోన్, కంప్యూటర్ల వినియోగం అధికమైనందున చాలా మంది కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా విద్యార్థులు వీటిని వీలైనంత తక్కువగా వినియోగించాలని సూచించారు. ఎలాంటి కంటి సమస్య వచ్చినా వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుగుణ మాట్లాడుతూ... తల్లిదండ్రులు తమ పిల్లలను టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండేలా చూసుకోవాలన్నారు. హోలీ క్రాస్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్య, వైద్యపరమైన సహాయ, సహకారం అందించేందుకు కృషి చేస్తుందన్నారు. కంటి సమస్యలున్న విద్యార్థులకు త్వరలో అద్దాలు అందజేస్తామని తెలిపారు. మ్యాక్సీ విజన్ ఐ ఆస్పత్రి ఆప్తమాటిస్ట్ లియాజ్ అలీ, కౌన్సిలర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

స్టాపుల్లో ఆగని బస్సులు

ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



ప్రధాన రహదారిపై ఆగిన బస్సుతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పరిధిలోని పలు స్టాపుల్లో సిటీ బస్సులు ఆపడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. వివరాలివీ... పీడీపీ చౌరస్తా ప్రాంతంలోని స్టాపులో బస్సులు నిలుపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రహదారిపై బస్సులు నిలుపుతుండటంతో ప్రమాదభరితంగా బస్సు ఎక్కేందుకు రోడ్లపై పరుగులు తీస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీడీపీ చౌరస్తా ప్రాంతంలోని బస్టాపు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని వ్యాపారులతో పాటు స్థానికులు ఈ బస్టాప్‌ను ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ బస్టాప్ రద్దీగా ఉంటుంది. ఈ బస్టాపు వద్ద బస్సును వెళ్లిపోయేందుకు గతంలో అధికారులు బస్ బేను ఏర్పాటు చేశారు. కానీ బస్సులు ఈ బస్టాపు వద్దకు రాకుండా ప్రధాన రహదారిపై నిలిపివేస్తున్నారు. దీంతో ప్రయాణికులు రోడ్లపై పరుగులు తీస్తూ బస్సులు ఎక్కేందుకు నానా ఆగచాట్లు పడుతున్నారు. కొందరు బస్సు ఎక్కే ప్రయత్నంలో కిందపడి గాయాలకు గురవుతున్నారు. ఈ విషయంలో ఆర్టీసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ఈ ప్రాంతంలో సర్వే జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టోలిచౌకీలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

గోల్కొండ: ఫుట్‌పాత్ ఆక్రమణలను సహించేది లేదని టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు టోలిచౌకీ టూంబ్స్ రోడ్డు, షేక్‌పేట్ నాలా తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుట్‌పాత్‌లను కబ్జా చేసి వాటిపై వెలిసిన డబ్బాలను తొలగించి వాటిని గోషామహల్‌కు తరలించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా హిమాయత్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బి.అమర్‌సింగ్ తెలిపారు. కాళీమందిర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇండస్ వ్యాలీ, సంజయ్‌గాంధీనగర్, భవానీ కాలనీ, బైరాగిగూడ, శివసాయినగర్, సుబ్రహ్మణ్య కాలనీ, రంగారెడ్డి కాలనీ, దత్తాత్రేయ కాలనీ, వాల్మీకి ఆశ్రమం, శివపురి, గంధంగూడ గృహకల్ప ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. సాయిరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాయిహర్ష కాలనీ, సాయిరామ్‌నగర్, సాయిరామ్ ఎన్‌క్లేవ్, సౌభాగ్యనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ వివరించారు.

'లోక్‌మంథన్'ను జయప్రదం చేయండి

శంషాబాద్: హైటెక్ సిటీ శిల్ప కళావేదికలో ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే లోక్‌మంథన్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ కోరారు. కార్యక్రమానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఆర్‌ఎస్ఎస్ చీఫ్ మోహన్‌భగవత్ హాజరుకానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో దేశంలో భిన్న సంస్కృతులు, ఆహారం, ఆహార్యానికి సంబంధించిన అనేక కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. ఉచిత ప్రవేశం కలిగిన ఈ కార్యక్రమానికి భాగ్యనగరవాసులు కుటుంబ సమేతంగా హాజరుకావాలని కోరారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చౌరస్తాలో జీహెచ్ఎంసీ నుంచి మంజూరైన రూ. 6.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. పాడైన రోడ్లకు మరమ్మతులు చేయాలని కొన్ని రోజులుగా బీజేపీ నాయకులు రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులకు వినతిపత్రాలను సమర్పించడంతో నిధులు మంజూరయ్యాయి. దీంతో రాజేంద్రనగర్ ఏఈ వేణుగోపాల్, ఈఈ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఇ.వేణుగోపాల్, బీజేపీ ఉపాధ్యక్షురాలు ఎం.రమాదేవి, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి డి.కవిత తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి

మణికొండ: ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు నేనాడో చెప్పారని, అందుకు ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించాల్సిన అవసరం ఎంతో ఉందని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం గండిపేటలోని కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్, కొండాపూర్ అపోలో ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తరచూ ఆరోగ్య పరీక్షలను నిర్వహించి డాక్టర్‌ల సూచనలు పాటించాలన్నారు. డాక్టర్లు శివనాగిని, అనూష, అనిత, చంద్రశేఖర్ ఆజాద్, లయన్స్ క్లబ్ సభ్యులు విజయలక్ష్మి, హరి ధర్మేందర్‌రెడ్డి, అరుణ, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జి.బాల్‌రెడ్డి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నార్సింగిలో ఏపీ మాజీ మంత్రి కొడాలి నాని



అశోక్‌యాదవ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కొడాలి నాని

మణికొండ: ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొడాలి నాని సతీసమేతంగా బుధవారం నార్సింగికి వచ్చారు. కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపల్ శాఖ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్ నివాసానికి వచ్చి గంట పాటు అక్కడే గడిపాన్నారు. ఆయన యోగా క్షేమాలు తెలుసుకుని వెళ్లారు. కార్యక్రమంలో నార్సింగి మాజీ సర్పంచ్ క్యాతం ప్రసన్న అశోక్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వృద్ధురాలి తరలింపు

మానవత్వం చాటుకున్న శంషాబాద్ చైర్‌పర్సన్

శంషాబాద్: నాలుగైదు రోజులుగా ఆహారం లేకుండా అచేతనగా పడి ఉన్న ఓ వృద్ధురాలి పట్ల శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ మానవత్వం చూపారు. పట్టణంలోని మధురానగర్ కాలనీలో ఓ వృద్ధురాలు రోడ్డు పక్కనే నాలుగైదు రోజులుగా పడుకుని ఉండటంతో కొందరు చేరదీసి కొంత ఆహారాన్ని అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ ఆమెను వృద్ధాశ్రమానికి తరలించేందుకు యత్నించినా ఆమె అనారోగ్యంగా ఉండటంతో అందుకు వీలుకాలేదు. దీంతో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ వృద్ధురాలిని దగ్గరుండి 108 అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వృద్ధురాలికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఫోన్‌లో సూచించారు.



వృద్ధురాలిని ఆస్పత్రికి తరలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ